విశాలాంధ్ర

స్కూళ్లు తెరిచే నాటికి నాడు-నేడు పనులు పూర్తికావాలి

- విద్యార్థులు డ్రాపవుట్ కాకుండా చర్యలు చేపట్టాలి - భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి
- ఫ్యామిలీ డాక్టర్ విధానంపై అవగాహన కల్పించాలి -అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు -రాజాం, గరివిడి మండలాల్లో పర్యటన

విశాలాంధ్ర-రాజాం: నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతులు, పాఠశాలల ఆధునీకరణ పనులను వేసవి సెలవుల అనంతరం పాఠశా లలు తెరిచేలోగా పూర్తిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన మరుగుదొడ్లు, పాఠశాల భవనాల మరమ్మతు పనులు వేసవిసెలవుల్లోనే పూర్తిచేయాలన్నారు. ఈ పనుల కోసం నిధుల కొరత లేదని త్వరగా పూర్తిచేయడంపై దృష్టిసారించాలని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తర్వాత చదువును కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల టీచర్లు, పంచాయతీ కార్యదర్శి, వలం టీర్లు, సంక్షేమ కార్యదర్శులు ఒక జట్టుగా ఏర్పడి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నా రు. రాజాం మండల పర్యటన లో భాగంగా బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ గురువారం సందర్శిం చారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనులను పరిశీలించారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులందరినీ ప్రత్యేక తరగతులకు రప్పించి వారందరూ ఉత్తీర్ణులయ్యేలా తగిన శిక్షణ ఇవ్వాలని పాఠశాల హెచ్ఎంని ఆదేశించారు. కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ రాజాం మండలం బొద్దాం, సోపేరు గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఉపాధిహామీ పనులు, హౌసింగ్ కాలనీల నిర్మాణం, సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్ భవనాల నిర్మాణాలను, సచివాలయాల పనితీరును, నాడు-నేడు కింద జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలిం చారు. బొద్దాంలోని జగ్గువానిపేట చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి ఉపాధిహామీ సిబ్బంది, వేతనదారులతో మాట్లాడారు. వేతనాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. పనుల్లో ఎందరు పాల్గొంటున్నారు, గ్రామ పంచా యతీలో గుర్తించిన ఉపాధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల వేతనాలు అందడంలో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని ఉపాధిహామీ అధికారులను ఆదేశించారు. బొద్దాంలోని పేదలందరికీ పథకంలో మంజూరైన ఇళ్ల కాలనీని సందర్శించి లబ్దిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి చెల్లింపులు జరగలేదని కొందరు లబ్దిదారులు వివరించగా దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. సామూ హిక గృహప్రవేశాల కోసం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గృహనిర్మాణ సంస్థ ఏ.ఇ.ని ఆదేశించారు. సోపేరు గ్రామంలో మంజూరైన గ్రామ సచివాలయం భవనాన్ని పరిశీలించి దాదాపుగా పూర్తికావచ్చినందున నెలాఖరులోగా దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. శ్లాబ్ దశలో ఆగిపోయిన రైతుభరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్ర భవనాలను మరో రెండు నెలల సమయంలో పూర్తిచేయాలని పంచాయతీరాజ్ డి.ఇ.ని ఆదేశించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి వివిధ శాఖల కార్యదర్శులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయ కార్యదర్శులకు సరిపడే రీతిలో యూనిఫాంలు సరఫరా కాలేదని మండల అధికారులు వివరించగా రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి సరఫరా చేసేలా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో స్వచ్ఛసంకల్పం కింద పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, పన్నుల వసూలు తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయం ద్వారా గ్రామంలో అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరోగ్య కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత గల బాలికలు, ప్రసూతి మహిళలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. హెమోగ్లోబిన్ శాతాన్ని కొలిచే హెచ్‌బి మీటర్ వున్నదీ లేనిదీ పరిశీలించి తనే స్వయంగా పరీక్షించుకున్నారు. ఈ పర్యటనలో ఆర్.డి.ఓ. అప్పారావు, ఎంపిడిఓ శంకర్రావు, ఇ.ఓ.పి.ఆర్.డి. శ్రీనివాస్, తహశీల్దార్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెపువలసలో ఫ్యామిలీ డాక్టర్ విధానం పరిశీలన

గరివిడి మండలం గూడెపు వలసలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు అందుతున్న వైద్య సేవలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మధుమేహం, రక్తపోటు తదితర జీవనశైలి వ్యాధులతో బాధపడుతున్న వారి గుర్తింపు ప్రక్రియ ఎంతమేరకు జరిగిందనే అంశంపై ఆరా తీశారు. ఇప్పటివరకు గ్రామంలోని 74శాతం మందితో సర్వే పూర్తయిన వైద్యులు వివరించగా వందశాతం గుర్తింపు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రసూతి మహిళలకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఈ కార్యక్రమంపై తెలియజేస్తే వారు మరింత అధికంగా ఈ కార్యక్రమం ద్వారా అందే సేవలను వినియోగించుకునే అవకాశం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.గోవింద, వైద్యాధికారి డా.కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు...

మాలమహానాడు నేతల ఫిర్యాదుపై స్పందన

కుమ్మపల్లి జంక్షన్‌లో బోరుబావికి మరమ్మతులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కుమ్మపల్లి జంక్షన్లో గల బోరుబావి గత కొంత కాలంగా మరమ్మతులకు గురై తాగునీటీ సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. కానీ ఈ బోరును బాగుచేయించడంలో ఎవరూ చొరవచూపలేదు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక మాలమహానాడు నాయకులు గొల్ల ఈశ్వరరావు, కణితి విజయ్ తదితరులు బోరుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యతో పాటు మండలస్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకుపోవడంతో వారు స్పందించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం బోరు మెకానిక్ లను పంపించి మరమ్మతులు జరిపించగా మాల మహానాడు ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు గొల్ల ఈశ్వరరావు, విజయనగరం జిల్లామాల మహానాడు ప్రధాన కార్యదర్శి కణితి విజయ్ లు సహకరించారు.జంక్షన్ లో పాదచారులు, షాపుల సమూహాలకు ఎంతగానో ఉపయోగపడుతున్న బోరుబావికి మరమ్మతులు జరిపించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి..

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో కొరటాం గ్రామంలో ఉన్న గుల్లిపల్లి సత్యం, లోచర్ల సింహాచలం, లోచర్ల రాంబాబు, బంకురు నారాయణ రావు, బంకురు సత్యం తదితర 10 కుటుంబాలు బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి బేబీ నాయనా, మండల నాయకులు నర్సుపల్లి వెంకట నాయుడు, నర్సుపల్లి వేంకటేశ్వర రావు, కొరటాం మాజీ సర్పంచ్ బంకురు తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ పార్టీని వదిలి టీడీపీ లోకి చేరారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బాడంగి: ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, ప్రభుత్వ పాలనను ప్రజల ఇంటిముం దుకే తీసుకు వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక శాసన సభ్యులు శంబంగి వెంకట చిన అప్పల నాయుడు పేర్కొన్నారు. గురు వారం మండలంలోని అనవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ గతంలో లాగా మండల కేంద్రాలకు తిరిగే పనిలేకుండా తమ గ్రామంలోనే ప్రభుత్వం అందించే అనేక రకాల సేవలు వినియోగించుకునేలా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ రూపొందించిందని అన్నారు. సచివా లయ ఉద్యోగులు నిరంతరం ప్రజలు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ప్రతీ ఇంటికి సుమారుగా లక్ష రూపాయలు పైన లబ్ధి చేకూరిందని ఆయన పేర్కొన్నారు.రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులు ఎరువులను,విత్తనాలు, ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బోగి ,జడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బొమ్మినాయుని రమేష్,ఉప సర్పంచ్ జ్యోతి,మండల జేసిఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు,ఎంపీపీ ప్రతినిది తెంటు మధు, వాకాడ వెంకటనాయుడు, వివిధ గ్రామ సర్పంచులు, వైసీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చెరువులు, స్థలాల కబ్జాదారులపై చర్యలేవి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ : తహశీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో ఉన్నటువంటి ఐటిఐ కాలనీ. చీపురుభంద. అమ్మి గారి కోనేరు గట్టుల పైన ఆక్రమణలు చేసి ఇల్లు నిర్మాణాలు చేపట్టి. ఆ స్థలాలను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ ఉంటే స్థానికంగా ఉన్న రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు మౌనం వహించడంలో ఆంతర్యం ఏమిటని..? సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. తహశీల్దార్ రాజారావు విధుల్లో చేరినప్పటి నుంచి పలుమార్లు అక్రమ భూదందాలపై సీపీఐ ఆధ్వర్యంలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని. ఎంతమంది ఆక్రమణ దారులపై చర్యలు చేపట్టారో సమాధానం చెప్పాలని మండల తహసిల్దార్ రాజారావుకి సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ. జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న లు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామాల్లో చెరువులు. ప్రభుత్వ భూములు ఆక్రమణలు మరింత ఎక్కువయ్యాయని. సిహెచ్ బొడ్డవలస పంచాయతీలో ఇప్పటికే రెండు ప్రభుత్వ చెరువులు పూర్తిగా కప్పివేశారని ఈ సందర్భంగా ఎమ్మార్వో గారికి మరోసారిగుర్తు చేశారు. తారకరామ కాలనీ ని ఆనుకుని ఉన్న చీపురు బందును ఇప్పటికే ఓ ప్రైవేట్ లే అవుట్ కు లబ్ధి చేకూర్చేందుకు చెరువు కబ్జాచేసి హడావుడిగా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారని. ఆ సిమెంట్ రోడ్డుకు మంజూ రైన నిధులను ఆపాలని డిమాండ్ చేశారు. చీపురు బంద. అమ్మి గారి కోనేరు గట్టులపై జరుగుతున్న అక్రమ కట్టడాలపై సిపిఐ చేసిన పోరాటాల ఫలితంగా విచారణకు వచ్చిన ఆర్డీవో స్వయానా విచారణ జరిపి ఆక్రమణ జరిగిన విషయం వాస్తవమేనని పత్రికాముఖంగా తెలియజేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో దర్జాగా అక్రమ ఇల్లు కట్టడాలు నిర్మిస్తున్నారని. ఇప్పటికైనా స్పందించి కోటి చెరువు.చీపురుబంద విస్తీర్ణం పూర్తిస్థాయిలో గుర్తించి చెరువునులి లిఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు అలాగే. అమ్మిగారి కోనేరు గట్టుపై అక్రమ ఇల్లు కట్టడాలు వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ వారికి అండగా రెవెన్యూ యంత్రాంగం ఉండటం సిగ్గుచేటుని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణకై 10 నుండి జూన్ 6 వరకూ దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ బందారు భాస్కరరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: ప్రభుత్వ శిక్షణ సంస్థ బొబ్బిలి లో ఆగస్టు 2023 సంవత్సరంలో అడ్మిషన్ల కొరకు ఆన్లైన్లో ద్వారా ఐటిఐ డాట్ ఏపీ గవర్నమెంట్ ఇన్ వెబ్సైట్లో అభ్యర్థులు నేరుగా వెబ్సైట్ లో సూచించిన విధంగా మే నెల పదో తేదీ నుండి జూన్ 6 సాయంత్రం ఐదు గంటల లోపు వరకు దరఖాస్తుల చేసుకోవచ్చుని స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ బందారు భాస్కరరావు స్థానిక విలేకరులకు తెలిపారు. లాగిన్ లో పదవ తరగతి హాల్ టికెట్ నెంబరు అభ్యర్థి పేరు తండ్రి పైల్స్ ఉంటాయని తెలిపారు. అప్లికేషన్ ఫారం సబ్మిట్ చేసిన తర్వాత యూనిక్యూ రిజిస్ట్రేషన్ నెంబర్ జనరేట్ అవుతుందని ఆ నెంబర్ను అభ్యర్థులు గుర్తుంచుకోవాలని ప్రింట్ మరియు ఏ క్లాజిమెంట్ తీసుకొని కౌన్సిలింగ్ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలి పారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు కౌన్సిలింగ్ నిమిత్తం విజయనగరం ప్రభుత్వ పారి శ్రామిక శిక్షణ సంస్థ లో హాజరుకావాలని కోరారు. బొబ్బిలి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో జాయిన్ అయ్యే అభ్యర్థులు ట్రేడ్స్ ఎలక్ట్రిషన్ , ఫిట్టర్, టర్నర్, మెస్నిస్ట్, డ్రాఫ్ట్ మాన్ మెకానికల్, రెండు సంవత్సరాలు శిక్షణ తరగతులు ఉన్నవి. డీజిల్ మెకానికల్, వెల్డర్, ఒక్క సంవత్సరం శిక్షణ తరగతులు కోర్సు కలదని తెలిపారు. డోన్ టెక్నాలజీ ఆరు నెలలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు చేసు కోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94920 23 220 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని కోరారు.

సీతం కళాశాలలో జాతీయ సాంకేతిక దినోత్సవ వేడుక

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఐఐటి మద్రాస్, భౌతిక శాస్త్ర ఆచార్యులు డా. ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఆయన ఈ ఏడాది థీమ్ స్కూల్ టు స్టార్టప్ - ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ టు ఇన్నోవేట్ అనే అంశంపై ప్రసంగించారు. కృత్రిమ మేధస్సు మరియు యంత్ర అభ్యాసం, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్ మొదలైన అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా రోబోటిక్స్ పరిణామాలు ,అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను గురించి విశ్లేషించారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి. శశి భూషణ్ రావు, మాట్లాడుతూ సాంకేతికతను అభివృద్ధి చేయడం యొక్క ప్రాముఖ్యతను గురించి, టెక్నాలజీ అభివృద్ధి వల్ల ఎదురవుతున్న సవాళ్లను గురించి వివరిస్తూ వాటి పరిష్కారాలను కనుగొనేలా విద్యార్థులు కృషి చేయాలని కోరారు. సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి ప్రసంగిస్తూ కొత్త విషయాలపై ప్రయోగాలు చేయడం వల్ల సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి, కన్వీనర్ డాక్టర్ జి. రవికిషోర్ మాట్లాడుతూ జాతీయ సాంకేతిక దినోత్సవం ప్రాముఖ్యతను, దాని చరిత్రలో ఇమిడి ఉన్న వివిధ అణు ప్రయోగాలను వివరించారు. కార్యక్రమంలో సీతం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సత్యగ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ బొత్స సత్య నారాయణ మరియు సత్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్. ఝాన్సీ లక్ష్మీ ఇటువంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు సీతం యాజమాన్యాన్ని అభినందించారు.

మోడల్ స్కూల్లో ఆరోతరగతి ప్రవేశానికి దరఖాస్తులాహ్వానం

విశాలాంధ్ర-డెంకాడ: 2023 2024 సంవత్సరానికి గాను ఏపీ మోడల్ స్కూల్లో ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తులను కోరుతున్నామని మండలంలోని అక్కివరం వద్దనున్న ఆదర్శ పాఠశాల లో ఆరవ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తులు పొరబడుతున్నారని పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య అన్నారు ఈ ప్రవేశపరచుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుతున్నాయని ప్రవేశ అర్హత ఓ బి సి వారికి 1 -9- 2011 నుండి 31 -8-23 మధ్య పుట్టి ఉండాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థులు 1-9-2009 నుండి 31-8-2013 మధ్యలో పుట్టి ఉండాలని ప్రవేశ రుసుము ఓసి, బీసీలకు 150 రూపాయలు ఎస్సీ ఎస్టీలకు 75 రూపాయలుగా ఉంటుందని 11-6-2023 ఉదయం పదిగంట నుండి మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించబడుతుందని అవకాశాన్ని డెంకాడ మండలంలో ఉన్న అర్హుల అయినా విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రా... చేపల మార్కెట్టా ? స్థానికుల ఆరోపణ

బంధువర్గమంతా ఒకే బెడ్‌పై...

విశాలాంధ్ర-సాలూరు టౌన్: సాలూరు పట్టణం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లు కేటాయించిన రూములో అలాగే బెడ్ పై ఉన్న జన సందోహం చూస్తే అసలు ప్రభుత్వ ఆసుపత్రి లా అనిపించట్లేదని స్థానిక ప్రజానీకం అంటుంది. వివరాల్లోకి వెళితే సాలూరు మండలం 240 గ్రామాలకు అలాగే సాలూరు పట్టణ ప్రజలకు అత్యవసర పరిస్థితులు ఉన్నవారికైనా స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆధారం. అలాంటి ప్రభుత్వాసుపత్రిలో చేపల మార్కెట్ కు జనాలు ఎలా వస్తారో అలా పేషెంట్ రూంలో జనాలు ఆ విధంగా ఉన్నారు. మరి ఈ విధంగా ఉంటే రోగాల బారిన పడిన రోగికి ఏ విధంగా వ్యాధి తగ్గుతుంది. ఇంట్లో ఎలా పడుకుంటారో అలా పేషెంట్ కు కేటాయించిన మంచంపై పిల్లలు,పెద్దలు నిద్రిస్తున్నారు. ఇందులో పేషెంట్ ఎవరో తెలియని పరిస్థితి. పేషెంట్ కు సంబంధించిన బంధువులు చూడడానికి వచ్చి చూసి వెళ్లకుండా అక్కడే ఉంటూ ఆ బెడ్ పై పడుకుంటూ ఆ బెడ్ పై తింటున్నారు. మరి పేషెంట్ ఎక్కడ పడుకుంటున్నారు..? ఇంత జరుగుతున్నా మరి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఏం చేస్తున్నారో అని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా ఉంటే పేషెంట్ కు రోగం తగ్గక వచ్చేవారు కూడా పేషంట్ల లాగా మారుతారని, కావున ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచి వచ్చే పోయేవారిని వెంటనే వెళ్లిపోయేలా చూడాలని స్థానికులు కోరుచున్నారు.

19న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా 10వ తరగతి నుండి యుజి, పిజి కోర్సులలో ఉత్తీర్ణత సాధించి వయస్సు 18 నుండి 30 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతకు ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి "సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాల " నందు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు 12 కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుంది. కావున ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువత తమ వివరాలను ఏపీ ఎస్ ఎస్‌డిసి వెబ్‌సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9.గంటలకు మెగా జాబ్ మేళ జరుగు ప్రదేశంలో హాజరు కావలసినదిగా ఎపిఎస్ఎస్ డిసి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు. సాయి కుమార్ కోరారు. వివరాలకు 7032060773, 6305110947 నందు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ బోధన ద్వారా సమ్మర్ స్పెషల్ క్లాస్ ల నిర్వహణ



విశాలాంధ్ర-బెలగాం: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పెషల్ క్లాసులు నిర్వహించడం జరుగుతోందని పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాసులలో విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన డిజిటల్ బోధన ద్వారా రెమెడియన్ క్లాసులు నిర్వహించడం జరుగుతుందని, పార్వతీపురం మన్యం జిల్లా సోషల్ వెల్ఫేర్ డిడి చొరవతో బాలురు, బాలికలకు హాస్టళు తెరవడం వలన విద్యార్థుల సంఖ్య పెరిగిందని, భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య మరింత పెరగడానికి అవకాశం కనిపిస్తోందన్నారు. అన్ని సబ్జెక్టులలోనూ విద్యార్థులకు నాణ్యమైన తర్ఫీదును ఇవ్వడం జరుగుతోందని తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

పీవో కల్పన కుమారి

విశాలాంధ్ర-సీతంపేట: సీతంపేట ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని పీవో కల్పన కుమారి అన్నారు. గురువారం వైద్య శాఖ, ఐసీడీఎస్ శాఖలతో సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా పీవో మాట్లాడుతూ కుక్కకాటు, పాముకాటు బాధితులు ఎక్కువ అవుతున్నారని అటువంటి కేసులపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని అన్నారు.గ్రామాల్లో తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయాలని మలేరియా సిబ్బందికి సూచించారు. డెంగ్యూ కేసులు వస్తే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మన్యం, శ్రీకాకుళం డీఎంహెచ్ వోలు జగన్నాధరావు, మీనాక్షి, డీఎంవోలు, ఐసిడిఎస్ పీడీలు జయదేవి, విజయగౌరీ, సీడీపీవోలు, రంగలక్ష్మి, వైద్యాధికారులు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో మంచి మార్కెట్ చేసుకోవాలి

విశాలాంధ్ర-సీతంపేట: సీతంపేట గజిలి గ్రామంలో ఆర్ట్స్ సంస్థ నాబార్డ్ వారి సహకారంతో వన సహజ రైతు ఉత్పత్తిదారుల కంపనీ వారి ఉద్యానవన శాఖ ద్వారా ఏర్పాటుచేసిన కలెక్షన్స్ సెంటర్లో సందర్శించారు. కార్యక్రమంలో శ్రీ రత్నాచార్యులు అస్టెంట్ డైరెక్టర్, మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉద్యాన శాఖ ద్వారా కలెక్షన్స్ సెంటర్లో ఏర్పాటు చేసుకుని రైతులు తమ పండ్లు ఒక దగ్గర చేర్చుకునే మంచి ధర వచ్చేటప్పుడు అమ్ముకోవాలని తెలిపారు జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సత్యన్నారాయణ రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యాన పంటలు అభివృద్ధి చేసుకుని మార్కెట్ ధర పెంపొందించుకోనుటకు మరింతగ రైతులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరేశ్వరి మండల ఉద్యాన వన శాఖ అధికారి, సవర ముఖలింగం చైర్మన్, గనేశ్వరరావు, సీఈఓ శంకర్రావు, సర్పంచి ప్రతినిధి మల్లేశ్వరరావు రైతు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారం భవిష్యత్తు

సబ్ కలెక్టర్ నూరల్ కమర్

విశాలాంధ్ర-పాలకొండ: బాగా చదువుకుని భవిష్యత్తును బంగారు బాటలు వేసుకొని తల్లితండ్రులకు చదువు నేర్పించిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ పేర్కొన్నారు. గురువారం పాలకొండ మండలం అన్నవరం గ్రామంలో ఉన్న పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన తల్లితండ్రులు విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాల్గొన్న సమావేశంలో మాట్లాడారు. విద్యతోనే జ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి మార్గంలో నడవాలని ఉన్నత స్థితిలో ఉద్యోగ ఉపాధి సంపాదించుకోవాలని కోరారు. సమాజం లో సంస్కారవంతులుగా మెలగాలన్నారు. సబ్ కలెక్టర్ స్థానిక సర్పంచ్ మండల ఉపాధ్యక్షులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సూర్యనారా యణ ఉపాధ్యాయులు రమణమూర్తి తదితర్లు పాల్గొన్నారు.

తోటపల్లి వద్ద పర్యాటక అభివృద్ధికి అవకాశం కల్పించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం: తోటపల్లి వద్ద పర్యాటక గ్రామ అభివృద్ధికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. తోటపల్లి రిజర్వాయర్ కు ఆనుకుని ఉన్న ప్రదేశంలో (ఖాళీ చేసిన మార్కొండపుట్టి) పర్యాటక గ్రామ అభివృద్ధికి వినియోగించుటకు అవకాశం కల్పించాలని, అచ్చట వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయుటకు అవకాశం ఉందని వివరించారు. పర్యాటకంగా మంచి అభివృద్ధికి అవకాశం ఉందని, తద్వారా ఉపాధి అవకాశాలు అనేక మందికి కలుగుతుందని చెప్పారు. వీటిపై ప్రతిపాదనలు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్యం, స్పందన కార్యక్రమం తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి వద్ద పర్యాటక అభివృద్ధికి అవకాశం ఉందని అన్నారు. గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, గర్భిణీలను ముందుగానే గర్భిణీల వసతి గృహాల్లో చేర్చుతున్నామన్నారు. రహదారి సౌకర్యం సక్రమంగా లేని గ్రామాలు, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆరు పడకలు ఏర్పాటు జరుగుతుందని, తద్వారా దగ్గరలోనే వైద్య సేవలు చేరువ కానుందని వివరించారు. గర్భిణీలకు ఆరోగ్య సేవలు అందించడంలో ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి..మంజుల వీణ, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి కె. విజయగౌరి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర-బెలగాం : గుర్తుతెలియని రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పార్వతీపురం గవర్నమెంట్ రైల్వే పోలీస్ కానిస్టేబుల్ సీతంనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం కూనేరు రామభద్రపురం దరి వులిపిరి రైల్వే గేటుకు సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని మహిళ మృతి చెందిందన్న సమాచారాన్ని అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించగా మృతురాలు అస్సాం రాష్ట్రం సోనిత్ పూర్ జిల్లా, రంగపరా నియోజకవర్గం & పిఎస్, ధులపడుంగ్ చాహ్ భగీచ పట్టణానికి చెందిన గీత గోవ్లా(46) గా ఆమె వద్ద ఆధారాలు లభించినట్లు గత రెండు రోజులుగా ఆమె ఈ పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు స్థానికులు చెప్పినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి మార్చ్యురీలో భద్రపరచినట్లు, ఎస్ఐ రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో నిలిచిన సాగునీటి ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తిచేస్తారు?

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

విశాలాంధ్ర-బెలగాం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధమ మహాసభ జయప్రదం కావడానికి సహాయ సహకారాలందించిన రైతు, రైతు శ్రేయోభిలాషు లందరికీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నూతనసమితి తరపున అధ్యక్ష, కార్యదర్శులు వెలగాడ శ్రావణ్ కుమార్, బుడితి అప్పలనాయుడులు ధన్యవా దాలు తెలిపారు. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహాసభకు హాజరైన ప్రతినిధులు చర్చించి చేసిన తీర్మానాల అమలు కోసం క్షేత్రస్థాయి పర్యటన చేసి రైతులకు అండగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని రైతు సమస్యలు పరిష్కరించడంలో సంఘం తనవంతుగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహాసభ సందర్భంగా చేసిన తీర్మానాలు అమలు కోసం దశాబ్దాల సమస్యగా ఉన్న జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేయడానికి ఉన్న అడ్డంకులను అధిగమించడానికి పాలకపక్షం తక్షణమే ఒరిస్సా ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరితగతిన సమస్య పరిష్కరించి రిజర్వాయర్ పూర్తికి కావలసిన నిధులను మంజూరు చేసి పనులు ప్రారం భించాలని దీనికై ఆయుకట్టు రైతులతో కార్యాచరణకై ఈనెల 31న పార్వతీ పురంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని ప్రకటించారు. జిల్లాలో ఉన్న ఏకైక చక్కెర పరిశ్రమ లచ్చయ్యపేటలోని చక్కెర పరిశ్రమను తక్షణమే ప్రభుత్వం స్వాధీనపరుచుకొని క్రషింగ్‌చేయాలని సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. జిల్లాను వెంటాడుతున్న ఏనుగుల సమస్య 2009లో భామిని మండలంలో ప్రవేశించిన ఏనుగులు నేటికి 18 మందిని పొట్టన పెట్టుకున్నాయని అదే సమయంలో 2018 లో చొరబడిన ఏనుగులు గుంపు 14 మందిని పొట్టను పెట్టుకుని కోట్లాది రూపాయల వ్యవసాయ పంటలను ధ్వంసం చేస్తూ నష్టపెడుతున్నాయన్నారు. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు, అటవీశాఖ అధికారులు కలుగజేసుకొని సురక్షిత ప్రాంతానికి తరలించి తగు చర్యలు తీసుకోవాలని మహాసభ తీర్మానం చేసిందన్నారు. భామిని మండలంలో కొండలో గడ్డ, పాలకొండ మండలంలో జంపర కోటగెడ్డ, ఒట్టిగెడ్డ, పెద్ద గెడ్డ, సీతానగరం పెద అంకలాం ఆనకట్ల ఆధునీకరణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అటవీ, వ్యవసాయ పంటలను నిల్వచేసుకొనుటకు శీతల గిడ్డంగుల సదుపాయం కల్పించాలని, 2023u24 ఖరీఫ్ సీజన్లో రైతులకు కావలసిన నాణ్యమైన వరి విత్తనాలు, ఎరువులు తక్షణమే రైతులకు అందుబాటులో ఉంచాలని మహాసభ డిమాండ్ చేసిందని, జిల్లాలో ఉన్న కౌలు రైతులను గుర్తించి రుణ అర్హత కార్డులు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి మహాసభ కోరిందన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం మహాసభలో తీసుకున్న నిర్ణయం మేరకు భవిష్యత్ కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వారితో పాటు వెలమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

13న విజయనగరం కోటలో ప్రత్యేక యోగా కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : యోగా పై విస్తృత ప్రచారమే లక్ష్యంగా ఈనెల 13న జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గీతం యూని వర్సిటీ అప్లైయిడ్ సైకాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ కె.సునీత తెలిపారు. స్థానికంగా గురజాడ స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యోగా ప్రశస్త్యాన్ని, ప్రయోజనాలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారయ్యేందుకు యోగా ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. యోగాను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతీఏటా జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. సామరస్య జీవన విధానమే లక్ష్యంగా, యోగాపై దేశ వ్యాప్తంగా విస్తృత ప్రచారాన్ని నిర్వహించేందుకు 100 రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, దీనిలో భాగంగా 39వ రోజు ప్రచార కార్యక్రమం విజయనగరంలో మే 13న జరుగుతుందని తెలిపారు. ఆయుష్ మంత్రిత్వశాఖ, మొరార్జీదేశాయ్ యోగ జాతీయ సంస్థ ఆధ్వర్యంలో జరిగే యోగా దినోత్సవంలో భాగంగా, యోగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిం చేందు కు దేశంలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేశారని తెలిపారు. దీనిలో భాగంగా విజయ నగరంలో గీతం డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగు తుందని వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విజయనగరం, విశాఖపట్నం నగరాలను మాత్రమే ఎంపిక చేయడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు. మే 13 ఉదయం 5.30 గంటలు నుంచి 7 గంటలు వరకు విజయనగరం కోటలోని మోతిమహల్ లో జరిగే ఈ ప్రత్యేక యోగా కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థలు, యోగ శిక్షణాసంస్థలు పాల్గొం టాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రతీఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ సునీత విజ్ఞప్తి చేశారు. విలేకర్ల సమావేశంలో అకాడమీ ఆఫ్ యోగా కాన్షస్‌నెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.శ్రీకృష్ణ, యోగ నిపుణులు ఎన్.రవి, సన్యాశిరావు, భారతి పాల్గొన్నారు. ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు.

మొక్కజొన్న నిల్వలు రైతు భరోసా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్

విశాలాంధ్ర-పాచిపెంట: మండలంలో పాంచాలి మతుమూరు గురివినాయుడు పేట గ్రామాలలో ఉన్న మొక్కజొన్న పంటల నిల్వలను మరియు రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి కే రాబర్ట్ పాల్ తనిఖీ చేశారు ముందుగా మొక్కజొన్న రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాలకు మద్దతు ధర 1962 రూపాయలు ప్రకటించిందని కొనుగోలు కేంద్రాలు ద్వారా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేపడుతుందని తక్కువ ధరలకు దళారీలకి అమ్మాల్సిన అవసరం లేదని తెలిపారు అనంతరం పత్తి పంట సాగు కొరకు భూమిని తయారు చేస్తున్న రైతుతో మాట్లాడుతూ పత్తి విత్తన రకాలు మొక్కజొన్న రకాలు గురించి ఆరా తీశారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న దిగుబడులు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు వచ్చాయని ఇవి సంతృప్తికరమైన దిగుబడులని తెలిపారు ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జూలై నెలలో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతులు సబ్ సాయిలర్ తో లోతైన వేసవి దుక్కులు చేసుకోవడం ద్వారా జూన్ నెలలో పడే వర్షపు నీటిని భూమిలో నిలువ చేసుకోవచ్చని మేలైన రకాలను మాత్రమే సాగు చేయాలని కోరారు తదుపరి గురువి నాయుడుపేట గ్రామంలో ఉన్న ఎరువుల షాపు తనిఖీచేసి నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని లేనట్లయితే లైసెన్స్ లు కూడా రద్దుచేస్తామని ఎరువుల డీలర్ కు హెచ్చరించారు గ్లైఫోసైట్ విక్రయానికి ఎలాంటి అనుమతులు లేవని గడ్డి పత్తి అమ్మకాలు నిషేధమని కాబట్టి వీటిని ఎవరు అమ్మకూడదని కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు అనంతరం రైతు భరోసా కేంద్రాల తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాలలో కియోస్క్ పనితీరు ఎరువుల నిల్వలు వివిధ రిజిస్టర్లు ఫైళ్ల తనిఖీ నిర్వహించారు తప్పనిసరిగా అన్ని రైతు భరోసా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీచేసి రిపోర్టును ఇవ్వాల్సిందిగా వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు, ఏడిఏ మధుసూదన్ రావులను ఆదేశించారు ప్రభుత్వ ఆదేశాలు తూచా తప్పకుండా గ్రామాలలో అమలయ్యే విధంగా వీఏఏల పనితీరు ఉండాలని గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాలలో తప్పనిసరిగా కష్టమ్ హైరింగ్ సెంటర్ల అద్దె వివరాలను నమోదు చేయాలని ఇంకా మొక్కజొన్న రైతులను రిజిస్ట్రేషన్ పూర్తి చేయనందుకు గ్రామ వ్యవసాయ సహాయకులకు మెమోలను అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎం కిసాన్ లబ్ధిదారుల ఈ కేవైసీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

ధర్మపురిలో ఆద్యంతం హుషారుగా గడపగడపకు మన ప్రభుత్వం..

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ధర్మపురిలో జరిగిన మూడవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆద్యంతం ఆనందంగా సాగింది. 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును వివరిస్తూనే స్థానిక సమస్యలు ఉంటే చెప్పండి అంటూ ప్రజల ను అడిగారు. అయితే స్థానికంగా చిన్నచిన్న సమస్యలు తప్పా చాలా వరకు పరిష్కారం అయ్యాయని ప్రజలు చెప్పడంతో హర్షం వ్యక్తం అయింది. అలాగే మధ్యవర్తులు, దళారులు లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు తమ ఖాతాలలోకే పడుతున్నాయని మహిళలు చెప్పడంతో ప్రభుత్వ పాలనా తీరుకు నిదర్శనమని కోలగట్ల బదులిచ్చారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మరలా గెలిపిస్తామని ప్రజలు చెప్పడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతి రావు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా నవరత్నాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రజలు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందని అన్నారు. మాట తప్పని మడమ తిప్పని నేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో నగరంలో అనేక అభివృద్ధి పనులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో జరుగుతున్నాయన్నారు. శంకుస్థాపన చేయడమే కాకుండా ప్రారంభోత్సవాలు కూడా తామే చేస్తుండం గర్వంగా ఉందని అన్నారు. నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయన్నారు. ప్రజావసరాలను తీర్చేయడమే ధ్యేయంగా కోలగట్ల చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన కాలువ సమస్యను పరిష్కరించడమే కాకుండా తక్షణమే పనులు ప్రారంభం కావడం గమనించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి,జోనల్ ఇన్చార్జ్ మారెం బాల బ్రహ్మారెడ్డి, డివిజన్ ఇన్చార్జి పూసర్ల శ్రీనివాసరావు,డివిజన్ యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం, డివిజన్ మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళి జెడ్పీహెచ్ స్కూల్‌ను పరిశీలించిన ఎంఈఓ త్రినాథ్

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో పెరుమాళి జెడ్పీహెచ్ స్కూల్ ను గురువారం పరిశీలించిన ఎంఈఓ జే.త్రినాధరావు ఈ కార్యక్రమంలో ఫెయిల్ అయిన పదవతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. ప్రధానోపాద్యాలు కు నిర్వహించవలసిన తరగతులపై తగు సూచనలు చేసారు.పెరుమాళి ఎంపీపీ స్కూల్ ను పరిశీలించి నాడునేడు ఫేజ్-2 పనులను,వర్క్ ప్రోగ్రస్‌ను పరిశీలించారు. మిగిలిన పనులను త్వరగా పూర్తిచెయ్యాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

9 మద్యం బాటిళ్లు పట్టివేత

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో గురువారం అక్రమంగా 9 మద్యం బాటిల్స్ ను తరలిస్తుండగా ఒక వ్యక్తిని పట్టుకున్నట్లు తెర్లాం ఎస్ ఐ రమేష్ నాయుడు విలేకర్ తో తెలిపారు.

14 నుండి పూర్తిగా అందుబాటులోకి మహిళా పార్కు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ఈనెల 14వ తేదీ సాయంత్రం నుండి మహిళా పార్క్ ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి వెల్లడించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశమై పార్కు నిర్వహణా విషయాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ సాయంత్రం నుండి మహిళా పార్కును మహిళలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి 9 గంటల వరకు, మరల సాయంత్రం 4 గంటల నుండి 9 గంటల వరకు ప్రవేశ వేళలుగా నిర్ణయించినట్లు చెప్పారు. పార్కులోకి కేవలం మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. అలాగే ఐదేళ్ల లోపు పిల్లలకు కూడా ప్రవేశ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. పార్కు నిర్వహణకు కమిటీ వేయడంతో పాటు పార్కులో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే పార్క్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై వినోదం కోసం చలనచిత్రాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఈఈ కె శ్రీనివాసరావు, ఎఈ వెంకటేశ్వరరావు, వివిధ మహిళా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామ సమీపంలో ఉన్న నాయుడు చెరువులో రజకుడు కసింకోట లక్ష్మణరావు(28) దుస్తులు ఉతుకుతున్నాడు. మధ్యాహ్న సమయంలో పిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా, మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో మేకలు కాస్తున్న యాదవులు మృతదేహాన్ని చూసి కుటుంబీకులకు సమాచారం అందించారు.ఈ మేరకు కుటుంబీకులు ఫిర్యాదు చేశారని, శవపంచనామ జరిపి పరీక్ష కొరకు మృతదేహాన్ని ఎస్.కోట ప్రభుత్వాసుపత్రి తరలించినట్టు వల్లంపూడి ఎస్సై కే రాజేష్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

కర్రోతును సత్కరించిన వేపాడ

విశాలాంధ్ర-భోగాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు పోలిపల్లిలో టి డి పి నెల్లిమర్ల నియోజక ఇంచార్జి కర్రోతు బంగార్రాజును మర్యాద పూర్వకంగా కలిశారు, కర్రోతు బంగార్రాజును వేపాడ చిరంజీవి రావు దుశ్శాలువతో సన్మానిస్తూ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల సమయములో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు గెలుపునకు చేసినకృషి మరువలేనిదని ప్రశంసించారు.

14న హనుమజ్జయంతి

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : వైశాఖ మాస బహుళ దశమి సందర్భంగా మే 14 ఆదివారం రోజున తెలుగు ప్రజానీకం 'హనుమజ్జయంతి' చేసుకుం టారని 'శ్రీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయం 'కమిటీ ప్రాజెక్టు చైర్మన్ మడిపల్లి చలం విలేకరుల సమావేశంలో తెలియజేసారు. హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, సింధు రార్చన, లక్ష తమలపాకులతో అర్చన జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి మహా అన్న ప్రసాదవితరణ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులెల్లరు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించా లని కోరారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంటపాటి బాల, కామరాజు, సాగర్,నాయుడు,శివ్వా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వల్లంపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం

ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వల్లం పూడి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం మద్యాహ్నం 3.30 గంటలకు గ్రామ సచి వాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు (సతీష్) అన్నారు. ఈ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున మండల స్థాయి వైయస్సార్ సిపి నాయకులు వివిధ హెూదాలో ఉన్న చైర్మన్లు నాయకులు డైరెక్టర్స్ గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు కన్వీనర్స్ అలాగే వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు.

ధర్మవరం వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరానికి

రూ.5 వేల షటిల్ కాక్స్ వితరణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ధర్మవరం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మే నెల ఒకటో తేదీ నుండి నిర్వహించబడుతున్న వేసవి షటిల్ బ్యాడ్మింటన్ శిబిరానికి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు తగరంపూడి రమణ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరానికి అవసరమైన ఐదువేల రూపాయల షటిల్ కాక్సును ఆయన మిత్రుడు తానవరపు గోవింద్ చేతుల మీదుగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పొట్నూరు శ్రీరాములుకు గురువారం ఉదయం క్రీడాకారుల మధ్య అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ పోరాపు వెంకట్రావు, తానవరపు గోవింద, జానా కేశవ, జానా గోవింద, కోచ్ లు హరిక, మౌనిక, యోగా కోచ్ కళ్యాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ఇలాంటి దాతలు ఉన్నంతకాలం క్రీడలు రాణిస్తాయని క్రీడాకారుల తరపున, పాఠశాల తరపున తగనంపూడి రమణకు ధన్యవాదాలు తెలియజేశారు.

56 పశువులకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-దత్తిరాజేరు : రిలయన్స్ ఫౌండేషన్ మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా పశు వైద్యాధికారి బి అవినాష్ ఆధ్వర్యంలో దత్తి గ్రామంలో గురువారం సుమారు 56 పశువులకు ఉచితంగా గర్భకోశ చికిత్సలు మరియు టీకాలు వేయడంతో పాటు వేసవి కాలంలో పశువులు కు తీసుకోవలసిన తగు జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. నట్టల నివారణ మందులు వేయడం జరిగిందని, పశువులకు ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ హెచ్ ఏ లు, గోపాలమిత్ర, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి సంతోష్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఉద్యోగులకు

కంప్యూటరీకరణ ప్రక్రియపై శిక్షణ

విశాలాంధ్ర -విజయనగరంటౌన్: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులకు పారదర్శకమైన సేవలను అందించేందుకు కంప్యూటరీకరణ ప్రక్రియను చేపట్టినట్లు డిసిసిబి సీఈవో కెంబూరుజనార్దన తెలియ జేశారు. కే.ఎల్.పురం లోని సహకార సంఘాల ఉద్యోగులకు కంప్యూటరీకరణ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 65 సహకార సంఘాల్లో కంప్యూటీకరణ సేవలు చేపట్టి నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. నాబార్డ్ డిడియం నాగార్జున మాట్లాడుతూ రైతాంగానికి ఆర్థికంగా చేయూతనందిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అనేక కార్యక్రమాలు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సహకార సంఘాల్లోకంప్యూటరీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా కోపరేటివ్ అధికారి పి.రమేష్, ఆప్కాబ్ జనరల్ మేనేజర్ జి ఎస్ ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక బహిరంగ వేలం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట పోలీసు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడ్డ 11 టన్నుల ఇసుకను నేడు అనగా శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్.ఐ జె.తారకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు బహిరంగ వేలంలో పాల్గొని ఇసుకను పాడుకోవాలని ఎస్.ఐ పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనిని ఒక్క పూటే పెట్టాలి

కొత్త సాఫ్ట్వేర్ రద్దు చేయాలి



విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఉపాధి హామీ పనిని ఒక్క పూటే పెట్టాలని, కొత్త సాఫ్ట్వేర్ రద్దు చేయాలని, జాబు కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం విజయనగరం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా శృంగవరపుకోట మండల కేంద్రం నడబందలో ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ మే 22న జరగబోయే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు.. యంత్రాలతో పనుల పెరుగుదలతో కూలీలకు రోజురోజుకీ పడిపోయాయని, వలసలు పోయి బ్రత కాల్సిన దుస్థితి నుంచి మార్పు రావాలని సూచించారు. ప్రజా సంఘాలు, వామపక్షాలు ఉపాధి హామీ చట్టాన్ని పోరాడి సాధించాయని, దీనివలన గ్రామీణ ప్రాంతంలో కూలీలు, కౌలు రైతులు, రైతులు, నిరుద్యోగులకు కొంత ఊరటగా 100 రోజుల పనిని పెంచి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో రూ.2.40. లక్షల కోట్లు కేటాయించాలనే ప్రజల్లో డిమాండ్ పెరిగింది కానీ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల కోరికను తుంగలో తొక్కిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ క్రమంగా ఎత్తేసేందుకు పూనుకుందని, తనంతటతాను ఉపాధి కూలీలు పని నుంచి తప్పుకునే విధంగా నిర్ణయాలు చేస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీని 30% తగ్గించి పథకానికి తూట్లు పొడిచారని, అలాగే మెటీరియల్ పనులు శాతం పెంచి కూలీల పనులు శాతం తగ్గించా రన్నారు. గతంలో మెటీరియల్ కు 10 శాతం మాత్రమే ఖర్చు చేసేవారని, దానిని మోడీ ప్రభుత్వం పుణ్యమా అంటూ 40% పెంచారన్నారు. దీనివల్ల పని దినాలు తగ్గించేశారని, నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెంచి ఉపాధి కూలీలకు కేవలం 15 రూపాయలు మాత్రమే పెంచారని, ప్రధాని మోడీ కూలీలకు వ్యతిరేకంగా ఉపాధిని లేకుండా చేసి దుర్మార్గంగా ఉన్నారనడానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. ఉపాధి పథకం ఎత్తివేయాలి కాబట్టి కొత్తగా సాఫ్ట్వేర్ తెచ్చారని, దీనిలో ఉన్న నిబంధనలు కారణంగా కూలీలు బెంబేలెత్తి మానివేయాలనేదే వీరి కుట్ర, అందుకని మండుటెండల్లో రెండు పూటలు అని పెట్టారన్నారు. రెండు పూటలా ఫోటోలు తీయాలి, సిగ్నల్ లేకపోతే పనికి వచ్చినను పనిచేయలేనట్లవుతుందని, దీనివలన పెళ్లిళ్లు, చావులు, ప్రయాణాలు, బ్యాంకు ఇతర పనులకు వెళ్లడానికి కుదరదన్నారు. ఎండలో మాడాలి.. వడదెబ్బకు రెండు పూటలా పని ఎందుకు పెట్టాలనీ, ఎండలో చంపడానికి కాదా అని.ప్రశ్నించారు. ఇది ఎక్కడి న్యాయం, అందుకని ఈ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు కార్మికులందరూ మే 22 తేదీన విజనయనగరం కలెక్టర్ కార్యాలయం వద్దకు రావాలని పిలుపునిచ్చారు.

కె.జి.పూడిలో లేగ దూడల ప్రదర్శన

ఆరోగ్యవంతమైన దూడలకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కొండ గంగుపూడి పంచాయతీ శివారు సీతారాంపురం గ్రామంలో గురువారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 40 లేగ దూడలు ప్రదర్శనకు హాజరు కాగా. ఉత్తమ లేగ దూడలుగా మూడు దూడలను ఎంపికచేసి దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పోటిపిరెడ్డి జగన్నాధం దూడకు,రెండవ బహుమతి చల్ల గణేష్ దూడకు కు,మూడవ బహుమతి కిలపర్తి వెంకటరావు దూడకు లభించాయి. దూడల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దూడలకు జున్నుపాలు తాగించాలని, పాముల ముందు క్రమం తప్పకుండా పట్టించాలని, విటమిన్ ఏ ఇంజక్షన్లు చేయించాలని సూచించారు.ఈ కార్యక్రమమునకు జిల్లా పశుసంర్ధక వైద్య శాఖ అధికారి వైవి రమణ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామచంద్ర రావు,పశుగణాభివృద్ధి సంఘం కార్యదర్శి దామోదర్, శృంగవరపు కోట అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చలపతిరావు ,పశు వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా పంచాయతీ రాజ్ జోనల్ ఇంచార్జ్ మెరుపుల సత్యనారాయణ, సర్పంచ్ గలారి బంగారయ్య, ఉప సర్పంచ ఎం పరదేశి నాయుడు మాజీ సర్పంచ్ అవగడ్డ పిన్నం నాయుడు, విశ్రాంత వీఆర్వో అవగడ్డ వెంకటరావు, పాడి రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థులచే పద్యబోధన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో తెర్లాం శాఖ గ్రంధాలయం లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులచే ఇంగ్లీష్ పద్యములు, తెలుగు పద్యములు చదివించారు. అనీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఆర్ రమేష్ హాజరు అయ్యి పిల్లలకు అవి చదివిన తర్వాత విటి సారాంశం తెలియజేసి తర్వాత పిల్లను ఆ పద్యముల యొక్క వివరములు అడీగి తెలుసుకున్నారు అనీ స్థానిక గ్రధాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

12, 13 తేదీల్లో గడపగడపకు కార్యక్రమం

విశాలాంధ్ర-దత్తిరాజేరు: వంగర సచివాలయం పరిధిలో గల వింద్యవాసి, వంగర గ్రామాల్లో ఈ నెల అనగా శుక్రవారం, శనివారం గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించబడునని వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు కడిబండి రమేష్ నాయుడు స్థానిక విలేకరులకు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

పీవి రావు ఆదర్శప్రాయుడు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఎస్సీ ల ఐక్యత కోసం నిరంతరం కృషి చేసి వారి హక్కుల కోసం పోరాడి ఎస్సీ ల నాయకుడు పీ. వీ. రావు అందరికి ఆదర్శప్రాయుడని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక న్యాయ సలహాదారుడు జూపుడీ ప్రభాకర్ రావు అన్నారు బుధవారం జిల్లా మాల మహానాడు కార్యాలయం లో జరిగిన స్వర్గీయ పీవి రావు జయంతి సభకు హాజరై ప్రసంగిస్తు ఏస్సి.లను వర్గీకరించరాదని ఎస్సీ లందరూ రిజర్వేషన్ పెంపుల కోసం ఎస్సీ రిజర్వేషన్ పోరాడాలని రాష్ట్రం అంతా పర్యటించి ప్రజలను చైతన్య పరచి మహానాయకుడు అని ఆయన సేవలు నీరుపమాణం అని ఆయన కేవలం ఎస్సీ ల కోసమే కాకుండాఎస్.టీ ల కోసం బీ.సీ ల కోసం పోరాడిన ఆంధ్ర అంబేద్కర్ పీ.వీ రావు అని అన్నారు 74 వ జయంతితీ సభ ముందు పీ.వి రావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సభ లో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిస రామ కృష్ణ, ఎస్సీ సెల్ అధక్షుడు జైహింద్ కుమార్ మాదిగ పోరాట సమితి కార్యదర్శి రాయి గురువులు, రెల్లి కుల సంఘ నాయకులు వద్దాది రమేష్, వెలగడ నాగరాజు, చోళ్లు అప్పారావు, బోనెల సింహాచలం, దప్పు శివ, యరసెట్టి శ్రీను, గుడివాడ నూకరాజు, వర్రీ సంతోషిమాత ,చొల్లు కృష్ణమ్మ, తలదా చంద్రమ్మ, కోరాడ నరయనారావు, తదితరులు పాల్గొన్నారు.

అతి త్వరలోనే రాజాంలో నూతన

తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-రేగిడి: రాజాం నియోజకవర్గంలో అతి త్వరలోనే నూతన టీడీపీ కార్యాలయం ప్రారంభించ నున్నట్లు మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి అన్నారు. గురువారం అంబకండి గ్రామం లో వివాహ వేడుకకు ఆమె ఆమెతోపాటు రేగిడి ఆమదాలవలస మండలం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కిమిడి వినయ్ కుమారులు వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిం చారు. అనంతరం ఈనెల 27వ తారీఖున తెలుగుదేశం పార్టీ రాజ మండ్రిలో నిర్వహించనున్న మహానాడు సభకు కార్యకర్తలు ప్రయాణ ఏర్పాట్లు పై కిమిడి వినయ్ కుమార్ తో ఆమె చర్చించారు. కావలి ప్రతిభా భారతి మాట్లాడుతూ రాజాం నియోజకవర్గం లో నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహానాడు సభ ను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహానాడు సభకు విచ్చేసిన టిడిపి నాయకులు,కార్యకర్తలు రాకపోకల నిమిత్తం ట్రావెల్స్ వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువగళంకు మద్దతుగా

15న 7కిలోమీటర్ల పాదయాత్ర

టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు సంజయ్ నాయుడు

విశాలాంధ్ర-వేపాడ: మాజీ మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర ఈ నెల15వ తేదీనాటికి 100 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా యువగళంనకు మద్దతుగా 15న 7కిలో మీటర్ల మేర నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని తెలుగు నాడు విద్యార్థి ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు గొర్రిపోటు సంజయ్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పాదయాత్రను ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జి కోళ్ల లలితకుమారి పర్యవేక్షణలో టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, ఐటీడీపి సంయుక్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసేందుకు టీడీపీ కార్యకర్తలు, మహిళలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ఈనెల 18న టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఇదేంఖర్మ కార్యక్రమంలో భాగంగా శృంగవరపుకోటకు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న బహిరంగసభను కూడా పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు పార్టీకి సంబంధించిన రెండు కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు.

ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ మూతపడటంలో

బాధ్యులెవరు : సిటూ ప్రశ్న

విశాలాంధ్ర-బొబ్బిలి : స్థానిక గ్రోత్ సెంటర్లో మైథాన్ (పూర్వ ఇంపెక్స్) ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ ప్రస్తుతం మూతపడింది. పరిశ్రమలో పనిచేసిన కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారు.ఫ్యాక్టరీ యాజమాన్యానికి కొండంత అండగా నిలిచిన స్థానిక ఎమ్మెల్యే, పోలీసులు ఆ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులను నిట్టనిలువునా ముంచేసారని ఉపాధి కావాలని అడిగిన పాపానికి వందలాది మంది అమాయకులైన గ్రామీణ కార్మికులను లాటీలతో కుళ్ళబొడిచి, విశాఖపట్నం సెంట్రల్ జైలుకు పంపించి, పాత సినిమాల్లో మాదిరిగా వికటాట్టహాసం పొందారని ఇప్పుడేమో ఫ్యాక్టరీని మూసివేశారని పిఐటియు నాయకులు పి.శంకర్రావు ఆరోపించారు. ఈ పాపం ఎవరిది? భూములు కోల్పోయి ఉపాధి కోసం కూలీలుగా మారిన రైతులదా? ప్రాణాంతకమైన కాలుష్యభూతంతో సహవాసం చేస్తున్న బాధిత గ్రామాల ప్రజలదా? లేక యాజమాన్యం విధానాలకు ఏమాత్రం సిగ్గూ, ఎగ్గూ లేకుండా సపోర్ట్ చేస్తున్న ప్రభుత్వానిదా? చివరాఖరుకు భారీగా మూల్యం చెల్లించుకున్న గ్రామస్తులకు జరిగిన నష్టాన్ని భర్తీచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేకుంటే అందుకు తగిన మూల్యం చెల్లించదానికి ప్రభుత్వం సిద్ధపడకతప్పదని... గ్రోత్ సెంటర్లో పారిశ్రామిక అభివృద్ధి ఈ వైసీపీ ప్రభుత్వ హయాంలో నేతిబీరకాయలో నేయి అన్న చందంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడాకారునికి ఎమ్మెల్యే శంబంగి అభినందనలు



విశాలాంధ్ర-బొబ్బిలి : చిత్తూరు జిల్లా తిరుపతిలో ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో అలజంగి గ్రామానికి చెందిన అథ్లెట్ రాపాక గణేశ్ పాల్గొన్నారు. పరుగుపందెం విభాగంలో 100మీటర్లు మరియు 200మీటర్లు పరుగు పందెంలో గెలుపొంది ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు క్యాంప్ కార్యాలయంలో గణేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. క్రీడాపోటీల్లో గెలుపొంది బొబ్బిలి ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వచ్చినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో అలజంగి ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మున్ నాయుడు, ఎఎంసి డైరెక్టర్ అల్లు త్రినాధ, రుంకాన ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే శంబంగిని మర్యాదపూర్వకంగా

కలిసిన నూతన డీఎస్పీ శ్రీధర్

విశాలాంధ్ర-బొబ్బిలి : నూతన డిఎస్పీ గా బొబ్బిలి డివిజన్ కు బదిలీపై విచ్చేసి ఇటీవల బాధ్యతలు చేపట్టిన డిఎస్పీ పి.శ్రీధర్ గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయనికి విచ్చేసి స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు.

సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఎంపిక పూర్తి



విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : ఈ నెల 14 న రాజమండ్రి లో జరగబోయే రాష్ట్ర స్థాయి వాలీ బాల్ సబ్ జూనియర్స్ సెలక్షన్స్ కు మన జిల్లా నుండి పంపేందుకు జరిగిన జిల్లా స్థాయి ఎంపికలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 30 మంది బాల బాలికలు హాజరయ్యారు. స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన.ఈ ఎంపికలలో జి. ప్రవల్లిక,బొబ్బిలి, ఎం.విజయలక్ష్మి (విజయనగరం), ఎం.జానకి (జి.ఎల్ పురం), పి.చాణక్యవర్మ (విజయనగరం) ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపికలో పాల్గొంటారని జిల్లా వాలీబాల్ అసోసి యేషన్ కార్యదర్శి కెవిఏఎన్ రాజు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చైర్మన్ భగవాన్ దాస్, అధ్యక్షులు జి.సూరిబాబు, కోశాధికారి సన్యాసి నాయుడు అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.